బల్ హాస్పటల్ - ధ్రప్రభ సచిత్రవారపత్రిక

**అతను వెళ్లిపోయాడు, నిర్దయగా గుడ్‌బై చెప్పేసి. ఎప్పుడో ఒకప్పుడు అతను వెళ్లిపోతాడని తెల్సుకానీ... ఇలా అర్థాంతరంగా నేను ఇంట్లో లేనప్పుడు వెళ్లిపోతాడని అనుకోలేదు.**

గుండెనెవరో అరచేత పట్టి పిండినట్టైంది. కళ్లలోకి ఉప్పెనలా నీరు పొంగి వచ్చింది. ఆధారం కోసం అంచును పట్టుకుని కుర్చీలో కూలబడ్డాను. చేతిలోని కాయితం గాలికి రెపరెపలాడుతోంది. లేత నీలంరంగు పేపరు మీద ముదురు నీలి అక్షరాలు ముత్యాలు పేర్చినట్టుగా ... "ఈ ప్రపంచంలో బాధ్యత వహించాలనుకునే వాళ్లందరూ ఎవరికి వారే సంకెళ్లు విధించుకోవాల్సి ఉంటుంది. స్వేచ్ఛకీ ప్రేమకీ తావులేని సంకెళ్లవి. గుడ్‌బై..."

"మేడమ్ అయ్యగార్ని లోపలికి తీసుకెళ్దామా" ఆటో డ్రైవర్ రాఘవ.



ఉలిక్కిపడి ఈ లోకంలోకొచ్చాను.

కన్నీళ్లని కళ్లలోకి దిగమింగి లేచి తలుపు తాళం తీసాను. రాఘవ మురళిని అమాంతం చేతుల్లోకి ఎత్తుకుని లోపలికి తెచ్చి మంచంమీద పడుకోబెట్టాడు. పర్స్‌లోంచి వందనోటు తీసి రాఘవకిచ్చాను. అతను నావైపొకసారి కృతజ్ఞతా పూర్వకంగా చూసి "ఎళ్లొస్తానయ్‌గారూ" అన్నాడు మురళివైపు తిరిగి. మురళి ఎప్పట్లాగే బ్లాంక్‌గా చూసాడతనివైపు.

"ఎల్తానమ్మా, ఏదన్నా పనుంటే కబురు చెయ్యండి" అన్నాడు. రాఘవ ఈ కాలనీలోనే ఉంటాడు.



యాంత్రికంగా మురళికి బట్టలు మార్చి, గోధుమ జావ తినిపించి, పాలుకాచి, గోరువెచ్చని పాలతో టాబ్లెట్స్ మింగించాను.

టీవీ ఆన్ చెయ్యమన్నట్టుగా వేలు కదిపి సైగ చేసాడు.

"వద్దు, చాలా రాత్రైంది, నిద్రపో" అన్నాను బ్లాంకెట్ కప్పి. అలసటగా కళ్లు మూసుకున్నాడు.

మనసు పొరల్లోంచి పొంగుకొస్తున్న దుఃఖం నా ఆకలిని చంపేసింది. ఓ కప్పు పాలు తాగి, లైటు తీసేసి మంచంమీద వాలిపోయేను.

ఉదయం పదకొండు గంటలవేళ వెళ్లాం హాస్పిటల్‌కి. ఎప్పట్లాగే మురళికి రకరకాల చెకప్‌లన్నీ పూర్తిచేసి కొత్తమందులు రాసిచ్చారు.

ఇక ఇంతేనా? మురళి అలా... నేనిలా ఉండాల్సిందేనా? మూసుకున్న రెప్పల్లోంచి వెచ్చని కన్నీరు ఉలికి చెవుల పక్కగా జుట్టులోకి జారుతోంది. నిజమేనా, ఈ దుఃఖం అంతా మురళి కోసమేనా? పదేళ్లుగా నేను అలవాటు పడిపోలేదా? మురళి ఇక లేచి తిరగడని నా హృదయానికి తెలీదా?

మరి... మరి.... ఈ పొంగి వస్తున్న దుఃఖం ఎవరికోసం?... హరి కోసం కాదా?

అవును అవును అని లోపలినుంచి అరుస్తోందొక గొంతు- హరి...

ఓ మధురమైన భావ వీచికలా కళ్లముందుకొచ్చాడు.

అతన్తో పరిచయం-

రెండేళ్ల క్రితానికి పరుగుతీసింది జ్ఞాపకం...

ఆ రోజు ఎప్పట్లాగే మురళిని స్నానం చేయించడానికి పడమటివైపు వరండాలోకి తీసుకెళ్లేను వీల్ చెయిర్లో. బాత్‌రూమ్స్‌లో గాలి ఆడక ఉక్కిరిబిక్కిరవుతాడు మురళి. చెయిర్లోంచి లేవదీసి స్టూలుమీద కూర్చోబెట్టే ప్రయత్నంలో ఆపలేక కిందికి వదిలేసాను. కంగారుతో కాళ్లూ చేతులూ ఆడలేదు నాకు. లేవదియ్యాలని ఎంత ప్రయత్నించినా నావల్ల కాలేదు. సాయానికి ఎవరైనా కనిపిస్తారేమోనని బైటికి పరుగెత్తేను. అస్సలు జనసంచారం లేని వీధి ఇది. అక్కడ మురళి ఏం ఇబ్బంది పడుతున్నాడో అనే భావం నన్ను మళ్లీ లోపలికి లాక్కొచ్చింది. నేనొచ్చేసరికి వెనక గేటు తీసుకుని లోపలికొచ్చిన ఒక అపరిచిత వ్యక్తి మురళిని భుజాలకింద చేతులేసి లేపి కూర్చోబెడుతున్నాడు.

"నాపేరు హరి. ఆ ఇంట్లోకి కొత్తగా వచ్చాను" అన్నాడతను మా ఇంటి వెనక ఉన్న తనున్న ఇంటివైపు చూపించి.

నేను కృతజ్ఞతగా చూసానతనివైపు. "ఈరోజు నర్సమ్మ ఇంకా రాలేదు" అన్నాను సంజాయిషీగా.

"ఫర్వాలేదు, ఏదైనా అవసరం అయితే పిలవండి" అని ఇంట్లోకి వెళ్లి తలుపేసుకున్నాడతను.

సింహాచలం కొండవక్క వెలసిన కాలనీ ఇది. అప్పట్లో ఇళ్ల స్థలాలు చవగ్గా వస్తున్నాయని కొంత, ప్రశాంతంగా ఉంటుందని కొంత విశాఖలో ఉద్యోగం చేస్తున్న చాలామంది ఇక్కడి స్థలాలు కొన్నారు. దేవస్థానం భూముల్ని కబ్జాచేసి ఎవరో ఇళ్ల స్థలాలుగా అమ్మేసారని, ఎప్పుడో ఒకప్పుడు దేవస్థానం ఎలాంటి హెచ్చరికా లేకుండా ఈ భూములన్నిటినీ స్వాధీనం చేసుకుంటుందనీ పుకారు రావడంతో కొన్ని ఇళ్లు కడుతూనూ, కొన్ని ప్రారంభించకుండానూ ఆగిపోయాయి. కట్టడం పూర్తైన ఇళ్లుకూడా అక్కడక్కడా విసిరేసినట్టుంటాయి.

ఎంతో కష్టపడి కట్టుకున్న ఈ ఇంట్లోకి వచ్చి ఏడాది తిరక్కుండానే మురళికి యాక్సిడెంటైంది.



**అయ్యబాబోయ్, అభిమాని!**

*ఎందుకని? అదే తెలియటం లేదు. 'భూత్' చిత్రంతో ఊర్మిళామాతోండ్కర్‌కు రామ్‌గోపాల్‌వర్మ, అజయ్ దేవగణ్‌లే కాక ఇతరత్రా కూడా అభిమానుల సంఖ్య పెరిగిపోతూందిట. ఇంతకూ ఈ వీరాభిమాని ఎవరో కానీ, తన విడాకుల కోసం వీరలెవెల్లో ఎదురు చూస్తున్నాడు. ఎందుకంటే, తరువాత ఊర్మిళను పెళ్లాట్టానికి సిద్ధపడున్నాడు కనుక. అయినా ఊర్మిళ ఒప్పుకోవాలిగా?!*

ఈ ఇంటికి తూర్పున మట్టి రోడ్డుంది. పడమటివైపు ఎవరో ఎత్తైన పెద్ద పునాది వేసి, ఓ మూలలో సింగిల్ రూం కట్టి వదిలేసారు. ఎవరూ ఆక్రమించుకోకుండా ఉండాలని కాబోలు ఆ గదికి గుమ్మం, తలుపులు పెట్టించి అద్దెకిస్తున్నారు. చాన్నాళ్లుగా ఆ రూంలో ఎవరూ లేరు. నెలక్రితం నుంచి ఆ గదిలో దీపం వెలగడం చూసి ఎవరో వచ్చేరనుకున్నాను, కాని, అతన్ని చూడడం ఇప్పుడే. ఆ గది తప్ప మా చుట్టు పక్కల వెయ్యి గజాల దరిదాపుల్లో ఇళ్లేం లేవు. కొండమీది గుడిగంటలు తప్ప పలకరించే శబ్దమూ ఉండేది కాదు. మొదట్లో చాలా భయం వేసేది. తర్వాత తర్వాత మురళిని ఇలాంటి ప్రశాంత వాతావరణంలోనే ఉంచాలని డాక్టర్లు చెప్పడం వలన అలవాటు పడక తప్పలేదు. నర్సమ్మ సింహాచలం ఊళ్లోంచి వస్తుంది. పగలంతా ఉండి రాత్రి పొద్దుపోయేవేళ వెళ్లిపోతుంది. బైటనుంచి ఏం కావాలన్నా తనే తెచ్చిపెడుతుంది.

మురళి బాగా ఉన్నప్పుడే ఇంటికి ఉత్తరం వైపున్న ఖాళీ స్థలంలో మంచి గార్డెన్ పెంచాడు. రెండు కొబ్బరి మొక్కలు కూడా వేసేడు. అవిప్పుడు పెరిగి పెద్దవై కాయలు కాస్తున్నాయి. సాయంకాలం వేళ వీల్ ఛెయిర్లో కూర్చోబెట్టి ఆ మొక్కల్లోకి తీసుకెళ్తే మురళి మొహంలో ఆనందవీచికలు తారాడతాయి. అందుకే నేను తీరిక దొరికినప్పుడల్లా నీళ్లుపోస్తూ మరిన్ని పూలమొక్కలు, కూరపాదులు పెంచుతున్నాను.

ఈ ఒంటరి జీవితాల్లో మురళికి నేనూ, నాకు మురళీ అని నేను గాఢంగా నమ్మేను. మురళిని బతికించడం కోసమే నేను బతుకుతున్నాను. ఆ రోజు అలా పిలవకుండానే వచ్చిన హరి నా జీవితంలోకి ఇంతగా ప్రవేశిస్తాడని నేనేనాడూ అనుకోలేదు.

ఆరాత్రి మురళి నిద్రపోయేక టీ.వీ. ఆఫ్ చేసి జిడ్డు క్రిష్ణమూర్తి సూక్తుల పుస్తకం తెరిచాను "ఆత్మరక్షణలోని హింసే కాకుండా ఒక పద్ధతి ప్రకారం తన కోరికల్ని మెలిపెట్టి వాటిని నీతిగానో మరోలానో ఉండేలా చెయ్యడం ఇవన్నీ హింసారూపాలే. ఇచ్ఛ అనేది కూడా హింసే, చిరాకు, కోపం, ఏదో ఒక ఆందోళన, దేనికో ఒకదానికి ప్రతిఘటన వీటన్నింటి నుంచీ స్వేచ్ఛగా ఉండగలమా? ఒక మనిషిగా హింసే లేకుండా బతకడం మాటల్లోనే కాదు మనస్ఫూర్తిగా సాధ్యమేనా? మానవులు కొన్ని వేల సంవత్సరాలుగా హింసాపూరితంగా జీవిస్తున్నారు. ఒక వ్యక్తిని శారీరకంగా, మానసికంగా హింసాత్మకంగా చేసేదేమిటి? హింసకి మూలం వేరుపడడం, విభజన." జిడ్డు క్రిష్ణమూర్తిగారి ఈ మాటల మెలికలు ఒకోసారి నన్ను గొప్ప కన్ఫ్యూజన్‌లో పడేస్తాయి. భగవద్గీత తెరచి సాంఖ్యయోగంలోని శ్లోకం ఒకటి చదవబోయాను. చాలా విసుగనిపించింది. పదేళ్లుగా చదివినవే మళ్లీ మళ్లీ చదువుతున్నాను.

ఏం తోచక నిస్పృహాయంగా తలపైకెత్తిన నాకు కిటికీ వెనక కూర్చుని తదేకంగా ఏదో వ్రాసుకుంటున్న హరి కనిపించాడు.

అతని వయసు పాతికదాటి ముప్పైలోపల ఉండొచ్చు. కొంత నిర్లక్ష్యంతో పెరిగిన గడ్డం. వేళకి తిండీ తిప్పలూ పట్టించుకోడనిపించే శరీరం- ఏమిటంత ఏకాగ్రతతో రాస్తున్నాడు? ఏముంది, ఏదో ఓ ఫర్మ్‌లో ఏ గుమాస్తా గానో అయి ఉంటాడు. ఆ ఫైల్స్ తెచ్చుకుని ఇంటిదగ్గర ఈ చాకిరీ చేస్తాడు కాబోలు. పనీపాటు లేని మనసు అతని గురించి ఊహించడం మొదలుపెట్టింది-

అతనో పేద కుటుంబం నుంచి వచ్చి ఉంటాడు. ఇంట్లో వృద్ధులైన తల్లీతండ్రి పెళ్లి కావలిసిన ఇద్దరు చెల్లెళ్లు, ఓ అవిటి తమ్ముడు: వాళ్లందరికీ ఇతను డబ్బులు పంపిస్తేగానీ జీవితం గడవదు. అందుకే పాపం, సిటీనుంచి ఇంతదూరంలో ఒంటరి గదిలో ఉంటూ, వండుకు తింటూ డబ్బులు పొదుపు చేస్తున్నాడు- ఇదేదో టీవీ సీరియల్ కథలా ఉందనిపించి నవ్వొచ్చింది.

ఎన్నాళ్లకి ఒక ఊహ నా పెదవులమీదికి నవ్వును తెచ్చింది!

మురళి మంచం ఎక్కేక మనస్ఫూర్తిగా నవ్వడం అనేది మరిచిపోయాను. మురళి బాగా ఉన్నప్పుడు ఆనందహేల అనిపించిన జీవితం క్రమంగా విషాదకీల అనిపించి దాన్నుంచి బైట పడడానికి వేదాంతాన్నీ, పురాణాల్నీ ఆశ్రయించింది. సజ్జనిండా కోసిన పూలు అయిపోయేదాకా ఒక్కొక్కటీ విసురుతూ చేసే విగ్రహారాధన జీవితానికి ఏమైనా సాంత్వన అవుతుందేమోనని ఆశ.

మొదట్లో ఎంతో లీనమైచేసే మురళికి సంబంధించిన పనులు క్రమంగా జీవితాన్ని ఓ గొప్ప విరక్తితో, అలసటతో నింపేయసాగాయి. అతని కోసమే ఈ బతుకు అనుకున్న నాకు క్రమంగా 'ఎందుకీ బ్రతుకు?' అన్న ప్రశ్న ఎదురు కాసాగింది. ఆ ప్రశ్న క్రమంగా నా పెదవుల మీది నవ్వును తుడిచేసింది.

అందుకే ఇప్పుడిలా అయాచితంగా లభించిన నవ్వు నాకో గొప్ప రిలీఫ్‌లా అనిపించింది.

మర్నాడు ఉదయం నేను మొక్కలకి నీళ్లు పెడుతుంటే అతను రూంకి తాళం వేసుకుని బైటికి వెళ్తున్నాడు. చుట్టూ ఉన్న పిట్టగోడ ఎత్తు తక్కువ కావడం వలన అతను సగంపైగా మనిషి గోడమీదినుంచి కన్పిస్తున్నాడు. అతను మెయిన్ రోడ్డుమీదికి వెళ్లడానికి మా ఇంటి పడమటి గోడనీ, ఉత్తరపు గోడనీ, తూర్పు గోడనీ చుట్టి వెళ్లాల్సి ఉంటుంది.

అతను తన ఇంటిమెట్లు దిగుతూ నిన్నటి పరిచయాన్ని పురస్కరించుకుని చిన్నగా నవ్వినట్లనిపించింది.

ముక్కూ మొహం తెలీని పరాయివ్యక్తిని నమ్మి అలా చనువివ్వకూడదనిపించి నేను కొంచెం మొహం తిప్పుకున్నాను.

***

ఆరోజు ఉదయాకాశం కొద్దిపాటి మబ్బుల్తో నిండి ఆహ్లాదంగా ఉంది. కొండ కాలువలోని సంపెంగ చెట్లకి విరబూసిన పూలపరిమళం గాలిలో తేలి తేలి వస్తోంది.

రికార్డర్లో నిత్య సంతోషిణి గొంతు లలితా సహస్రనామాల్ని మంద్రస్థాయిలో పలుకుతోంది.

ఆరోజు కూడా నర్సమ్మరాక ఇంట్లో పని తెమల్లేదు. స్టవ్వుమీద ఇడ్లీపెట్టి చెట్నీ కోసం కొబ్బరి చెక్క తురుముతున్నాను.


"ఎక్స్‌క్యూజ్ మీ"

ఉలిక్కిపడి వెనక్కి తిరిగిచూసేను. వంటింటి గుమ్మంలో అతను హరి.

"కొంచెం మంచినీళ్లిస్తారా"

అతను తెచ్చిన ఖాళీ బాటిల్లో నీళ్లు నింపుతున్నాను.

"రోజూ కష్టపడి నీళ్లు పోస్తున్నారు. పూసిన పూలన్నీ మీరే తుంచేస్తున్నారు. మీ మనసుకేం నొప్పి కలగట్లేదా?" అన్నాడతను బిందెమీది పూలసజ్జ నిండుగా ఉన్న పూలను చూస్తూ.




"పూజకోసం" అన్నాను నేనూ అటే చూస్తూ.

"ఒక్కసారి ఆలోచించండి, ఆ పూలన్నీ తోటలో చెట్లకి ఉంటే బావుంటాయా, మీ పూజా పటాల దగ్గర పడి వడలిపోతే బావుంటాయా?" బాటిల్ అందుకుని నా వైపు చూడకుండానే వెళ్లిపోయాడతను. ఆ గొంతులో నిష్ఠూరం లేదు.

అతను వెళ్లిపోయాక ఆలోచనలో పడ్డాను. అతనన్నది నిజమే ననిపించింది. మర్నాడు కింద రాలిన పూలను మాత్రమే ఏరితెచ్చాను.

తన రూంబైట పునాది అంచుమీద నిలబడి పూలతో నిండి ఉన్న చెట్లని ఆనందంగా పరికిస్తూ కన్పించాడతను. "థేంక్స్" అన్నాడు నాకు విన్పించేలా.

మరోరోజు నీళ్లకోసం వస్తూ మార్క్స్ కేపిటల్ తెచ్చిచ్చాడు.

"ఎందుకిది?" అన్నాను నేను దాన్ని అటూ ఇటూ తిప్పిచూసి "చదివి చూడండి. మీ భగవద్గీతకన్నా డిఫరెంట్‌గా ఉంటుంది. ఊరికే,

ఫర్ ఛేంజ్" మర్నాడు ఆ పుస్తకాన్ని తిరిగి ఇచ్చేస్తుంటే "అప్పుడే చదివేసారా?" అన్నాడతను.

"లేదు, నాకేం అర్థం కావడం లేదు"

"భగవద్గీత అర్థం అవుతోందా?"

"లేదు, కాని అది చదివితే మనశ్శాంతి కలుగుతుంది."

"నిజంగా మీ మనసు శాంతిగా ఉందా?" జవాబు వినకుండానే వెళ్లిపోయాడతను.

క్రమంగా అతనడిగే ప్రశ్నలు నన్ను గొప్ప ఆలోచనల్లో పడేస్తున్నాయి.

"ఇంతేనా జీవితం, ఇంకేం లేదా?" అన్నాడోసారి. ఆ ప్రశ్న నన్ను కొన్ని రోజులపాటు వెంటాడింది.

నర్సమ్మ కూతుర్ని పురిటికి తీసుకొచ్చింది. తరచుగా మానేస్తోంది. నర్సమ్మ రాని రోజు హరి చొరవగా లోపలికొచ్చి సాయం చేస్తున్నాడు, ముఖ్యంగా మురళికి సంబంధించిన పనుల్లో.

"ఏమైంది మురళిగారికి?"

"యాక్సిడెంట్లో వెన్నెముకకి దెబ్బ తగిలింది. ఇంచుమించుగా అవయవాలన్నీ చచ్చుపడిపోయాయి. బ్రెయిన్‌కి తగిలిన దెబ్బవలన నోటి మాట పోయింది."

"ఏం చేసేవారీయన?"

"ఓ ప్రైవేటు ఫర్మ్‌లో ఇంజనీరు. వర్క్ స్పాట్లోనే యాక్సిడెంట్ జరిగింది."

"మీరిద్దరేనా ఇంట్లో?"

"అవును, పెళ్లయిన రెండేళ్లకే ఇలా జరిగింది. అప్పటికింకా పిల్లలు వద్దనుకున్నాం."

"బంధువులెవర్నైనా సాయంగా తెచ్చుకోలేకపోయారా?"

"కొత్తలో బంధువులు రావడం అయ్యింది, పోవడమూ అయ్యింది. బర్డెన్‌గా ఉండడానికి ఇష్టపడేవాళ్లేగాని సాయపడేవాళ్లెవరూ బంధువుల్లో ఉండరని గ్రహించడానికి ఏడాది పైనే పట్టింది." సంభాషణలోని విషాదాన్ని తేలిక చెయ్యాలని కాబోలు "నర్సమ్మకిచ్చే జీతం నాకూ ఇవ్వరాదూ, మీ పనులన్నీ నేనే చేసిపెడతాను" అన్నాడు మురళి వైపు చూస్తూ. అది నిజమో, హాస్యమో నాకర్థం కాలేదు. అవును, ఇతను ఏరోజూ టైంకి బైటికెళ్లడం చూళ్లేదు. ఏం చేస్తున్నట్టు? అదే అడిగానతన్ని.

"అందుకేగా మిమ్మల్ని ఉద్యోగం అడుగుతూంట" నవ్వుతూ అని వెళ్లిపోయాడు.

ఒకరోజు నర్సమ్మ "ఏటమ్మో, మన ఎనకింటి బాబు ఎప్పుడు సూడు బస్టేండు కాడ కాపీ ఒటెల్లో ఏయో పేపర్లు సూసుకుంటా కూకుని కనపడతాడు. ఉజ్జోగం, సజ్జోగం ఏవున్నట్టు నేదు" అంది. "జాగర్తమ్మో వొంటి దాయుంటావు, ఆ బాబుని ఎప్పుడంతే అప్పుడు నోపలికి రానియ్కు"

నేను పకపకా నవ్వి "ఒకవేళ అతను దొంగే అయితే మనింట్లో ఏమున్నై అతనెత్తుకుపోడానికి? అయినా అతను మనిషి అలా కనపడ్డం లేదులే" అన్నాను.


నర్సమ్మ నావేపు అదాటున నిశ్చలంగా చూసింది.

"ఆ... అదేమరి, ఉప్పుడందరూ సూటూ బూటూ ఏస్కునీ వోళ్లే దొంగతనాలు సేత్తన్నారు."

"సరే నర్సమ్మో, మనింట్లో ఆ టీవీ తప్ప అతనెత్తుకు పోడానికి ఇంకేం ఉన్నాయి చెప్పు విలువైన వస్తువులు? అది కూడా పాతదై పోయింది?

మురళికి యాక్సిడెంటు తర్వాత ఆఫీసు వాళ్లిచ్చిన డబ్బు ఇంటికి లోన్‌కి సరిపోయిందనీ, ఇంట్లో విలువైన వస్తువులన్నీ అమ్మేసి వచ్చిన డబ్బు బేంకులో వేసి దానిమీద వడ్డీతో క్లుప్తంగా బతుకుతున్నామని నర్సమ్మకి తెల్సు.

నర్సమ్మ కూతురికి పురిట్లో చాలా సుస్తీ చేసింది. నర్సమ్మ పన్లోకి రావడానికి వీలుకాకుండా అయ్యింది. తన బదులు ఎవర్నో

పంపించింది కానీ ఆ మనిషి పట్టుమని పదిరోజులు కూడా తిరక్కుండా మానేసింది.

హరిలోని ఇతరులకి సాయపడే లక్షణం వల్లో, మురళి హరిని స్నేహపాత్రంగా స్వీకరించడంవల్లో, నా కుతూహలం వల్లో హరి క్రమంగా మా ఇంట్లో మాకు కావాల్సిన ఓ వ్యక్తిగా మారిపోయాడు. హరి వచ్చాక మురళి మీది నా అటెన్షన్ పెరిగింది. ఒక అలవాటుగా విసుగ్గా చేస్తున్న మురళి పనులు ఎంతో ఇష్టంగా, ప్రేమగా చేస్తున్నాను. ఉదయం లేస్తూనే మురళికి టాయ్‌లెట్‌కి బెడ్‌పేన్ పెట్టడం, బ్రష్ చేయించడం, స్నానం చేయించి బట్టలు మార్చడం, పక్కబట్టలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా బెడ్‌షీట్స్ మార్చడం, వేళకి టిఫిన్, కాఫీ, భోజనం, చిరుతిళ్లు, ఫ్రూట్ జ్యూస్‌లు, జావ తయారుచేసి తినిపించడం అన్నీ చేస్తూ అలిసిపోయే నేను ఇప్పుడు గొప్ప హుషారుతో పనలన్నీ హరితో పంచుకుంటున్నాను. ఆ బలాన్ని నాకు హరి స్నేహం ఇచ్చింది.

ఒకోసారి హరి రోజుల తరబడి ఎక్కడికో వెళ్లివస్తాడు. ఎక్కడికెళ్లి వచ్చేడో చెప్పడు. ఒకోసారి పూనకం వచ్చినవాడిలా గొప్ప ఆవేశంతో మాట్లాడతాడు. ఒకోసారి మౌనంగా ఉండిపోతాడు. సమాజం మీది ప్రేమ అతన్ని ఎటో నడిపిస్తోందని మాత్రం నాకర్థమైంది.

"జీవించడానికి కావలసిన ముఖ్యమైన లక్షణం మనుషుల మీద నమ్మకం. జీవితం మీద నమ్మకం. ప్రపంచాన్నీ, మనుషుల్నీ నమ్మలేని స్థితి విషాదకరమైంది." అంటాడతను.

అతను చెప్పింతర్వాత రోజూ పేపరు చూస్తున్నాను. టీవీలో న్యూస్ ఫాలో అవుతున్నాను.

ఒకరోజు నేను విష్ణు సహస్రనామాలు వల్లెవేస్తుంటే "వల్లె వేయండి, బాగా వల్లెవేయండి, మీలాంటి వాళ్లంతా లోకం ఏమైపోతే నాకెందుకు నా చాపా, గూడూ నాకుందిగా అనుకున్నంత కాలం ఈలోకం బాగుపడదు" అన్నాడు.

"మధ్యలో నేనేం చేసాను? యోగా చెయ్యమనీ, భగవన్నామ జపం చేస్తే మనసు ప్రశాంతంగా ఉంటుందని రాజకీయ నాయకులంతా చెప్తుంటే నువ్వేంటిలా మండిపడతావు."

"అవును. వదండి అందరం నామజపాలు చేసుకుంటూ ఏ హిమాలయాలకో పోదాం. అవతల ప్రపంచీకరణవల్ల ఆర్థిక తేడాలు పెరిగి సామాన్యుల బతుకులు దుర్భరమౌతున్నాయి. అప్పులు తీరే మార్గం లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. సంపద ఉన్నవారిచేతిలోనే



హీరోయిన్నంతే!

సమీరారెడ్డి నిర్మా సంజయ్ గుప్త చిత్రం 'ప్లాన్'లో చేస్తుంది. 'డర్‌నా మనా హై'లో ఓ సెక్సీ డాన్స్ చేసి బాలీవుడ్‌లోని అందరి దృష్టిలోనూ పడింది. 'ప్లాన్' చిత్రం కోసం నానా పాట్లూ పడి మొత్తంమీద ఎలాగైతేనేం, వేషం సంపాదించుకుంది. జనం సమీరను నిర్మాత సంజయ్ గుప్త 'గర్ల్ ఫ్రెండ్' అనుకుంటున్నారని అంటే మాత్రం చెడ్డ కోపం వస్తుంది ఆమెకు. "నేనా చిత్రంలో హీరోయిన్ను, అంతే కానీ. నిర్మాత గర్ల్ ఫ్రెండునేం కాదు! ఇదంతా సిగ్గు లేనివారు వాగే వాగుడే!" అంటుంది కోపంతో మండిపోతూ. అయినా ఆ చెప్పేదేదో కాస్త శాంతంగా చెప్పొచ్చు కదా, అంత కోపమెందుకో? ఏమో!

బందీ అవుతోంది. పేదవారు మరింత పేదవారవుతున్నారు. కర్మాగారాలు అర్థాంతరంగా మూతపడి కార్మికులు, పనులు దొరక్క కూలీలు మరింత పేదతనంలో కూరుకుపోతున్నారు. జనం ఏమైపోయినా ఫర్వాలేదు. ఉన్న ఆలయాలు చాలవని మండలానికో పాతికలక్షలు శాంక్షన్ చేసి కొత్త ఆలయాల్ని నిర్మిస్తారట ఘనత వహించిన ప్రభుత్వంవారు. ఇంటర్మీడియట్ ఎగ్జామ్ హాల్స్‌లో కెమెరాలు అమర్చి పరీక్షలు రాయిస్తారట. చదువులయ్యాక ఉద్యోగాలు లేవు అని మొండిచెయ్యి చూపించే దానికి ఈ సిగ్గులేని స్టంటు ఎందుకట?" ఆవేశంతో అతని కళ్లలో ఎర్రజీరలు ఏర్పడ్డాయి.

"ప్రపంచీకరణ ప్రపంచాన్ని ఏకతాటి మీదికి తెస్తోందంటుంటే నువ్వేంటిలా? ప్రపంచీకరణకి వ్యతిరేకంగా మాట్లాడ్డం, నడుకోవడం ఇప్పటి ఫేషను కాదట తెల్సా?"

"ఎవరు చెప్పేరు? ప్రపంచీకరణ ఎవర్ని ఏకతాటిమీదికి తెస్తోంది, ప్రపంచంలో ధనికులందర్నీ తెస్తోంది. శ్రమను నమ్ముకున్న వాళ్లందర్నీ అథః పాతాళానికి తొక్కి పడేస్తోంది. పోనీ మధ్య తరగతికి చెందిన మీరు ఎలాంటి అసంతృప్తులూ లేకుండా ఉన్నారా? పదేళ్లనాడు మీరు బేంకులో డబ్బు దాచుకున్నప్పుడు వడ్డీరేటు ఎంతుంది, ఇప్పుడెంతుంది, మీరే చెప్పండి."

"అవును. నిజమే. అప్పటి వడ్డీరేటు బావుండేది, ధరలు ఇప్పటికన్నా తక్కువగా ఉండేవి. వచ్చిన వడ్డీ ఇంటి ఖర్చులకుపోను కొంత చిల్లర చేతిలో మిగిలేది. ఇప్పుడు వడ్డీరేటు పడిపోయింది. ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. వచ్చే డబ్బులు చాలక అసలునుంచి కొంత కొంత డ్రాచేసి ఖర్చుచేయాల్సి వస్తోంది. కొన్నాళ్లుపోతే ఈ ఇల్లైనా మిగులుతుందా అని భయంగా ఉంది."

"ఇదంతా భారతీయ సామాజిక వ్యవస్థలో కొన్ని అభివృద్ధి నిరోధక శక్తులు బలం పుంజుకున్న ధోరణికి నిదర్శనం. ఎక్కడైనా ఎన్నికలు నిజాయితీగా జరుగుతున్నాయేమో చెప్పండి చూద్దాం. దెబ్బతిన్న పర్యావరణం, ధ్వని. వాయు కాలుష్యాలు ప్రజాసమస్యలుగా ఈనాడు ముందుకొచ్చాయి. వివిధ రంగాల్లో అవినీతి పెద్ద భూతంలా సాక్షాత్కరిస్తోంది. ఈరోజు లంచం లేకుండా ఏ ఆఫీసులోనైనా మీరు ఒక్క చిన్నపని, సపోజ్ రేషను కార్డు పుట్టించుకురండి చూద్దాం. అవన్నీ చిన్న వ్యవహారాలు. ఇప్పుడు కోట్లలో మింగుతున్నవాళ్లు తయారయ్యారు."

ఇలా ఉండేది హరి ధోరణి-

ఒకోసారి అతన్ని చూస్తే నాకు భయంగా ఉండేది. ఎందుకిలా జ్వలిస్తాడితను? ఈకాలం కుర్రాళ్లందరిలా ఏదెలా పోతే నాకేం అని ఏ ప్రేమ సినిమాలో చూసుకుంటూ గడిపేయడెందుకని?

క్రమంగా హరిపట్లా, అతని భావాలపట్లా నాలో ప్రేమ పుట్టుకురావడం ప్రారంభమైంది. ఆ ప్రేమ నాకు తెలీకుండానే నన్ను గొప్ప పరధ్యానంలో పడేసింది. స్టవ్వుమీద పెట్టిన పాలు పొంగిపోతూ ఉంటాయి. నా మనసు అతని గురించి ఆలోచిస్తూ దాన్ని గమనించదు. వండుతున్న వంటకంలో ఉప్పు బదులు పంచదారో, కారం బదులు పసుపో వేసేస్తున్నాను.

సభ్యత కాదని ఓర్చుకుంటున్నాను కానీ, నా హృదయం గొప్ప ఆత్మీయతతో అతన్ని

హత్తుకొనేందుకు సన్నద్ధమౌతోంది. ఇలాంటి సమయంలో హరి ఈ చిన్ని ఉత్తరంతో వీడ్కోలు చెప్పేసి వెళ్ళిపోయాడు.

అతను జోక్ చేసి ఉంటాడనీ, తిరిగి వస్తాడనీ నాకు నేనే చెప్పుకున్నాను. తెరిచి ఉన్న అతని గది కిటికీ గాలికి సన్నగా చప్పుడు చేస్తోంది. వెలగని లైటు నా హృదయపు గదిలో దుఃఖపు చీకటిని నింపేస్తోంది. అతని కోసం ఎదురుచూసి చూసి నా కళ్లు అలసిపోయాయి. అతను జోక్ చేసే తరహా మనిషి కాడనీ, ఏం చెప్పినా మనస్సులోంచే చెప్తాడనీ నా కర్థమైంది. ఆ ఇంటి ఓనరు వచ్చి తలుపులు మూసి తాళాలు వేసుకుని వెళ్లేడు. క్రమంగా రోజులు వారాలై, వారాలు నెలలై కాలం గాయపు పచ్చిని మాన్పుతోంది.

మురళి మీది నా అటెన్షన్ తగ్గిపోయింది. ఎప్పటి నిర్వేదం, విసుగు ప్రారంభమయ్యాయి. నన్ను పిలవడానికి మురళి చేసే శబ్దం ఇప్పుడు మళ్లీ కర్ణకఠోరంగా వినిపిస్తోంది. అతనికి చేసే సేవలన్నీ అర్థం లేనివిగా కనిపిస్తున్నాయి. 'జీవితం ఇంతేనా?' అని నన్ను నేను ప్రశ్నించుకుంటే కాదని జవాబు వస్తోంది.

***

మురళిని ఇంట్లో ఉంచి తాళం వేసి నర్సమ్మ ఇల్లు వెతుక్కుంటూ వెళ్లేను. పురిట్లో వచ్చిన జబ్బుతో నర్సమ్మ కూతురి కాళ్లు చచ్చుబడిపోయాయి. బాధ్యత మీదే అని అల్లుడు వదిలేసి వెళ్లిపోయాడు. కూతురి వైద్యానికి నీడనిచ్చే గుడిసెను అమ్మేయవలసొచ్చింది. నర్సమ్మ మొగుడు పనిచేసే కంపెనీ ఎత్తేసారు. తిరిగి తెరుస్తారని కొన్నాళ్లూ, కాంపన్సేషను ఇస్తారని కొన్నాళ్లూ ఊరించారు. నర్సమ్మ మొగుడు ఎవరి దగ్గరో రిక్షాని బాడుగకి తెచ్చుకుని తొక్కుతున్నాడు. నలుగురు పిల్లల్తో ఇంటందరూ నిరాధారంగా జీవచ్ఛవాల్లా ఉన్నారు. ఎవరి పంచలోనో వండుకు తింటున్నారు.

కుడిచెయ్యి ఎడమచెయ్యి అనకుండా నర్సమ్మ కూతురికి చేస్తున్న చాకిరీ చూసాక నాకు కొంత జ్ఞానోదయమైంది.

"ఈ ప్రపంచంలో బాధ్యత వహించాలనుకునే వాళ్లందరూ ఎవరికి వారే సంకెళ్లు విధించుకోవాల్సి ఉంటుంది. స్వేచ్ఛకీ, ప్రేమకీ తావులేని సంకెళ్లవి." హరి ఉత్తరంలోని వాక్యాలు గుర్తుకొచ్చాయి.

మీలాంటి వాళ్లంతా లోకం ఏమైపోతే నాకెందుకు, నా చాపా, గూడూ నాకుందిగా అనుకున్నంతకాలం ఈలోకం బాగుపడదు" హరి మాటలు తరచుగా నా చెవుల్లో వినిపిస్తున్నాయి. కాని, అతని లాగా ఈ లోకాన్నంతనీ బాగుచెయ్యాలనుకునేంత ధైర్యమూ, ఓపికా నాకు లేవు అనుకున్నా నిన్నాళ్లూ. ముందు నాకు కావాల్సింది అవగాహన అని అర్థమైందిప్పుడు. అవగాహన దానికదే ధైర్యాన్ని సమకూరుస్తుంది.

ఇంటి తాళం తీసి లోపలికెళ్లేను. మురళి నిస్పృహ గూడు కట్టుకున్న ముఖంతో కళ్లుమూసుకుని ఉన్నాడు. గొప్ప ఉద్వేగంతో అతన్ని చేరుకుని అతని ముఖాన్ని హత్తుకున్నాను. ఆశ్చర్యంతో తెరుచుకున్న మురళి కళ్లల్లోంచి రెండు కన్నీటి బిందువులు నామెడ కింది వంపులోకి జారి నిష్క్రమించాయి.

ఆ సాయంకాలమే ఇంట్లో ఎక్కడపడితే అక్కడ పడి ఉన్న హరి పుస్తకాలన్నీ వెదికి టెబుల్ మీద సర్దిపెట్టేను. ఆ రాత్రి పనులన్నీ ముగిసాక టేబుల్ లేంపు వెలుగులో హరి సంతకంతో ఉన్న ఆ పుస్తకాన్ని చదవడానికి తెరిచినప్పుడు మూసి ఉన్న ఆ కిటికీ, దానివెనక చీకటీ నన్నేమీ కదిలించలేదు. ■


# LTC TOURS FOR CENTRAL GOVT. EMPLOYEES

## GOOD NEWS దక్షిణ/ఉత్తర భారత యాత్రలు

| | Frequency | Fare Rs. |
|---|---|---|
| 1. Delhi-Vaishno Devi-Dalhousie-Amritsar -Kullu-Manali-Delhi | Every Mon. | 6000/- |
| 2. Delhi-Shimla-Kullu-Manali-Rohtang pass-Chandigarh-Kurukshetra-Delhi. | Every Friday | 4400/- |
| 3. Delhi-Jaipur-Agra-Delhi (By A/c Coach) | Every Mon. | 1600/- |
| 4. Delhi-Mussoorie-Haridwar-Rishikesh-Lakshman Jhoola-Delhi | Every Tue/Fri. | 1400/- |
| 5. Delhi-Badrinath-Kedarnath-Delhi | Every Mon./Fri. | 5000/-* |
| 6. Delhi-Badrinath-Kedarnath-Gangotri-Yamunotri-Delhi | Every Friday | 7500/-* |

మీరు ఢిల్లీ వచ్చినపుడు అధునాతన సౌకర్యములతో నిర్మింపబడిన 75 రూములు గల హోటల్ సదరన్‌లో బసచేయండి. రుచికరమైన తెలుగు భోజనం మా హోటల్ అమరావతి/సుప్రభాత్ రెస్టారెంట్లలో లభించును.

**(We are authorised to run L.T.C. Tours by India Tourism Development Corporation for employees working in Government of India/Central Government Undertakings) దక్షిణ భారత యాత్రల వివరములకు మా ఆఫీసులను సంప్రదించండి.**

We arrange hotel accommodation & food at all tourist destinations for Govt. employees availing LTC at discounted rates. All North India tours are by Super Deluxe buses, starting from ITDC Offices Hotel Samrat, Chanakyapuri, New Delhi. Contact our offices for advance reservations at **Mumbai Ph : 23426895, Bangalore Ph : 2262633, Chennai : 25364864, Vijayawada Ph: 2576624, Vizag Ph : 2541099**

**HOTEL SOUTHERN**

* includes vegetarian food enroute

**SOUTHERN TRAVEL (P) LTD.**

H.O. 18/2, Arya Samaj Road, Karol Bagh, New Delhi-110 005
Ph : 2573 9508, 2572 2210 E-mail : southern@del2.vsnl.net.in

(Recognised by Ministry of Tourism, Govt. of India)
Serving since 32 years. (ఢిల్లీలోని తెలుగువారి ప్రముఖ వాణిజ్య సంస్థ)

Hotel Ayodhya Complex, Ground Floor, Lakdika Pool
Hyderabad. A.P. Ph : 040-2330 7658, 2330 3561

SURYA